

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

## నిజామాబాద్ కామారెడ్డి

మంగళవారం, 21 మే, 2024 పేజీలు : 02


## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి.

**అదనపు కలెక్టర్ చంద్రమోహన్**

**కామారెడ్డి, సూర్య మేజర్ న్యూస్, మే 20 :**

ధాన్యం కొనుగోలు ముమ్మరంగా చేపట్టాలని సోమవారం ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు, రైస్ మిల్లుల ప్రతినిధులు, సహకార, మార్కెటింగ్, పౌరసర పరాల శాఖ అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో జెసి చాంబర్లో సమీక్ష నిర్వహించారు.




ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు నాలుగు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని రైస్ మిల్లుల యజమానులు ఎప్పటికప్పుడు అన్లోడ్ చేయించుకోవాలని సూచించారు. సివిల్ సప్లై అధికారులు పర్యవేక్షణ చేయాలని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 350 కొనుగోలు కేంద్రాలలో రూ.583 కోట్ల విలువైన 2.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు రైతులకు ఖాతాలలో రూ.529 కోట్ల రూపాయలు జమ చేసినట్లు చెప్పారు. 97% ట్యాబ్ ఎంట్రీ పూర్తయిందని వెల్లడించారు. రవాణా శాఖ అధికారులు లారీలను ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో దాన్యం నిలువలు లేకుండా చూడాలని చెప్పారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున బాబు, ఇన్చార్జి జిల్లా పౌరసరఫరాల మేనేజర్ నిత్యానందం, ఇన్చార్జి జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్, సహకార శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు, రైస్ మిల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతుల ఆందోళన

### దిగివచ్చిన అధికారులు

**బిక్కనూర్ మే 20 సూర్య మేజర్ న్యూస్:**



తడిసిన వడ్లు తరుగు పేరుతో రైతులను మోసం చేస్తున్నారని, మండలంలోని కాచాపూర్ రైతులు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ అధికారులు, రైస్ మిల్ యజమానులు సోమవారం గ్రామానికి చేరుకొని గ్రామ రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. తరుగు లేకుండా, అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. ఈకార్యక్రమంలో పూర్ణిమ రైస్ మిల్ యజమాని శ్రీనివాస్ ,ప్రభుత్వ సివిల్ సప్లై డిప్యూటీ తహ సిల్దార్ కిష్టయ్య, గ్రామ బిజెపి అధ్యక్షుడు అనిల్ కుమార్, పూస శంకర్, కామిండ్ల రాజ, సంతోష్ రెడ్డి, అజయ్‌రెడ్డి, పబ్బతి చంద్రయ్య, నరేష్, కమ్మరి నవీన్ చారి మరియు కొంతమంది రైతులు పాల్గొన్నారు.

## అంతా కల్తీమయం



## కొని తెచ్చుకుంటున్న అనారోగ్యం

**కల్తీ సరుకులు, నకిలీ వస్తువులు, తప్పుడు తూకాలతో మోస పోతున్న వినియోగదారులు..!**

**ప్రజలకు వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం ఉందా లేదా తెలియదు..??**



**కామారెడ్డి సూర్య ప్రతినిధి, 20 మే, సూర్య మేజర్ న్యూస్**

జిల్లాలో కల్తీ సరుకులు నకిలీ వస్తువులు తప్పుడు తూకాల ద్వారా వ్యాపారులు వినియోగదారులను మోసం చేస్తున్నారు. సరుకుల నాణ్యతకు త్రిలోదకాలుచ్చి కల్తీ సరుకులను ఇచ్చి విక్రయించడంతో ప్రజలు అనారోగ్యానికి కొని తెచ్చుకుంటున్నారు. సరుకుల నాణ్యతను పరిశీలించడంలో అవగాహన లేని గ్రామీణ ప్రాంత ప్రజలను వ్యాపారులు నిలువున దో చేస్తున్నారు. సరుకుల నాణ్యత విషయంలో ప్రభుత్వ నిబంధనల ఫలితాలు వినియోగదారుల దరిచేరడం లేదు. కల్తీ సరుకులు నకిలీ వస్తువులు తప్పుడు తూకాలపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ నామమాత్రంగా మారింది. దీంతో వ్యాపారులు ఆడింది ఆట పాడింది పాటగా మారింది. వినియోగదారుల హక్కులను వివరించి వారిలో చైతన్యం తేవాల్సిన వినియోగదారుల సంఘాలు పట్టణాలకి పరిమితమై గ్రామీణ ప్రాంతాల్లో మచ్చుకైనా కనిపించడం లేదు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం ఉందన్న విషయం కూడా వినియోగదారులకు తెలియకపోవడంతో వ్యాపారులకు లాభసాటిగా మారింది. 1986 లో ప్రభుత్వం వినియోగదారులకు హక్కుల పరిరక్షణ కోసం చట్టాన్ని రూపొందించి 1987 నుంచి అమలు చేస్తుంది. శరవేగంతో అభివృద్ధి చెందుతున్న ఈ ఆధునిక సమాజంలో రోజురోజుకు పెరుగుతున్న వ్యాపారాల పోటీ తట్టుకునేందుకు పలు వ్యాపార సంస్థలు ఉత్పత్తులపై అందమైన లేబుల్లను వేసి ఆకర్షణ మైన గిఫ్టులతో వినియోగదారులను బోల్తా కొట్టిస్తున్నారు. వినియోగదారులు సరుకులకు రసీదులతో పాటు దుకాణ సీలు వేసి తూనికల వినియోగదారుల ధరల పట్టిక బోర్డు విధిగా ఉంచాలని నిబంధనలో ఉన్నప్పటికీ మచ్చుకైనా కనిపించవు. బియ్యంలో రాళ్లు, మట్టి, పేల్లలతో పాటు బియ్యం పాలిష్ కోసం ఒక రకమైన పొడిని కలిపి మోసం చేస్తున్నారు. నకిలీ వస్తువులు మార్కెట్లో విరివిగా వచ్చి పడుతున్నాయి. టూత్ పేస్టులు, పౌడర్లు, పప్పులు, మసాలాలు కూడా కల్తీ మేమవుతున్నాయి. గోధుమపిండి ఉప్పు, రవ్వ ,మైదా పిండి, నిల్వ ఉంచిన వాటిని విక్రయించడంతో ప్రజలు అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు, బాన్సువాడ, ఎల్లారెడ్డి, పిట్లం, లింగంపేట్, సదాశివనగర్, గాంధారి మండలాల్లో గ్రామాల్లోనీ దుకాణాలు కల్తీ సరుకులు విచ్చలవిడిగా అమ్ముతున్నారు కల్తీ సరుకులతో భోజనం పదార్థాలు తయారు చేసుకుని తిని అనారోగ్యం పాలవుతున్నారు ఇటీవల కాలంలో కల్తీ సరుకులు పలు మండలాల్లోని గ్రామాల్లో బయటపడి కలవరం రేకెత్తిస్తున్నాయి పలు హోటల్లో మిరపకాయ బజ్జీలు తిని పలువురు అస్వస్థకు గురైన సందర్భాలు ఉన్నాయి. డబ్బు పోసి అనారోగ్యాన్ని కొనితెచ్చుకుంటున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఈ సరుకులను విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు చేపట్టడంతో పాటు వినియోగదారుల ఆరోగ్యానికి ముప్పు రాకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు.

